
యం. రాధిక



# బలి కోరే వజ్రం

షాప్‌లోకి అడుగుపెడుతున్న కాంతా రామ్‌ని చూడగానే ముందు ఆశ్చర్య పోయినా తర్వాత తేరుకుని పలకరింపుగా నవ్వాడు భరద్వాజ.

"బావున్నావా? చాలా కాలమయింది కదూ మనం కలుసుకుని."

"అవును. నాలుగేళ్ళయింది" అతని వంక పరీక్షగా చూస్తూ చెప్పాడు కాంతా రామ్.

ఇదివరకటికంటే బాగా లావయ్యాడు భరద్వాజ. రెండు చేతులకున్న ఉంగరాలు, మెళ్ళో గొలుసు, మాట్లాడుతున్నపుడు తళుక్కున మెరిసే బంగారపు పన్ను, అత్యంతాధునికమైన షాపు అతని స్టేటస్‌ను తెలుపుతున్నాయి. 'దొంగ వ్యాపారాల్లో బాగా సంపాదించాడల్లే వుంది' కసిగా మనసులో అనుకున్నాడు కాంతారామ్.

ఇక్కడ వీళ్ళిద్దరి గురించి కొంత చెప్పాలి. నాలుగేళ్ళ క్రితంవరకూ వాళ్ళిద్దరూ మంచి స్నేహితులే కాకుండా బిజినెస్‌లో పార్ట్‌నర్స్ కూడా. అయితే భరద్వాజ వ్యాపారపు లెక్కల్లో తేడాలు చూపించి, కాంతారామ్‌కి చెయ్యి చూపించాడు. అదంతా మోసమని తెలిసినా ఏం చెయ్యలేక వూరు వదిలి వెళ్ళిపోయాడు కాంతారామ్.

ఆ తరువాత భరద్వాజ జ్యూయలరీ షాప్ తెరిచాడు. తెలివితేటలతో వ్యాపారాన్ని అంచెలంచెలుగా పెంచి ఈ రోజున నగరంలోని ప్రముఖులలో ఒకడు కాగలిగాడు.

నాలుగేళ్ళ తరువాత హఠాత్తుగా కాంతారామ్ ప్రత్యక్షమయ్యేసరికి భరద్వాజకి ఆశ్చర్యంతోపాటు భయంకూడా కలిగింది.

కాంతారామ్ డబ్బు ఏమన్నా అప్పుగా అడిగితే ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు భరద్వాజ. అతని భయం అతనిది మరి.

కాంతారామ్ అదేం గమనించకుండా భరద్వాజ ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ "నా దగ్గర ఒక అపురూప వజ్రం వుంది. తీసుకుంటావా?" అనడిగాడు.

భరద్వాజ ఆసక్తితో ముందుకు వంగి "ఏం వజ్రం అది?" అనడిగాడు.

సమాధానంగా బ్రీఫ్‌కేసులోంచి ఒక చిన్న దంతపు భరిణను తీసి భరద్వాజ ముందుంచాడు కాంతారామ్.

ఆత్రంగా ఆ భరిణ మూత తెరిచాడు భరద్వాజ.


లోపల...

పిడికిలిలో పట్టేంత వజ్రం మిలమిల మెరుస్తూ కనిపించింది దాని మిలమిలలకు కళ్ళు బైర్లుకమ్ముతున్న ట్లనిపించింది భరద్వాజకి.

తన లైఫ్‌లో ఇంతవరకూ అలాంటి వజ్రాన్ని చూడలేదతను నిజంగా అది అపురూప వజ్రమే ఆ వజ్రం తన దగ్గరుంటే... ఆనందంతో గెంతులేస్తోంది భరద్వాజ మనసు.

అయితే కాంతారామ్ తనవంకే చూస్తున్నాడని గ్రహించగానే తప్పున ఫీలింగ్స్ దాచేసుకుని, అనాసక్తిగా మొహం పెట్టి "మామూలు వజ్రమే. అయినా ధర ఎంత చెబుతున్నావ్?" అన్నాడు.

అతని మాటకు తల అడ్డంగాతిప్పుతూ "ఇది మామూలు వజ్రం కాదు. 11వ శతాబ్దానికి చెందిన రష్యన్ చక్రవర్తుల కిరీటంలో పొదగబడిన వజ్రం యిది. హోప్‌వజ్రంగా ప్రపంచప్రఖ్యాతి చెందిన ఈవజ్రాన్ని న్యూయార్క్‌లో కొన్నాను. ఇంత అపురూపమైన వజ్రం నా దగ్గర కంటే, నీ దగ్గరుంటేనే బాగుంటుందని తీసుకువచ్చాను. లక్ష రూపాయలకు కొన్నాను. అందులో ఒక పది తగ్గించు




కుని మిగతావి ఇచ్చేయి" అని చెప్పాడు శాంతారామ్.

హోప్ వజ్రం గతంలో ఎంతో మంది జీవితాలతో చెలగాటమాడింది. ఎంతో మంది ఆ వజ్రాన్ని కొని అనూహ్యమైన రీతిలో మృత్యువాత బడ్డారు.

అయిదు వందల సంవత్సరాల క్రితం ఒక పూజారి దేవాలయంలోని విగ్రహం ఫాలభాగంలో స్థాపితమైన ఈ వజ్రాన్ని దొంగిలించిన నేరానికి గాను మరణశిక్ష పొందాడు. తర్వాత జాన్ అనే ఫ్రెంచి దేశీయుడు దీని స్వంతదారునిగా వ్యవహరించిన తరుణంలో రేచుకుక్కలతో దారుణంగా చంపబడ్డాడు. తరువాత ఈ వజ్రం ఫ్రెంచి రాచకుటుంబీకుల చేతులలో పడింది కానీ యువరాణి లాంబెల్లి ఒక వర్గం చేతులలో దారుణ మరణానికి గురయింది. అనక ఈ వజ్రం ధరించిన మేరీ ఆంటోనటి శిరచ్ఛేదానికి గురైంది. ఆ తర్వాత ఈ వజ్రాన్ని కొన్న జాక్వెస్ సిలాట్ మతి భ్రమించి ఆత్మహత్య చేసుకున్నాడు.

అనంతరం రష్యన్ యువరాజు ఈ వజ్రాన్ని సేకరించి, తన ప్రియురాలికి బహూకరించాడు. కానీ కొంతకాలానికి ఆమె యువరాజు చేతులలోనే హతమయిపోయింది. చివరకు హెన్రీ థామస్ హోప్ ఈ వజ్రాన్ని కొనుక్కొని, వాషింగ్టన్ లోని స్మిర్ నోనియన్ ఇనిస్టిట్యూట్‌లో భద్రపరిచాడు.

హోప్ వజ్రం గత చరిత్రను భరద్వాజకి చెప్పదలుచుకోలేదు శాంతారామ్. చెబితే వజ్రం కొనడం మానేస్తాడని అతని భయం. భరద్వాజకి ఎలాగయినా అంటగట్టాలి. ఇదీ శాంతారామ్ ఆలోచన.

భరద్వాజ ఇష్టంలేనట్లు మొహంపెట్టి

"వస్తువు అమ్ముడవటానికి రకరకాలుగా చెబుతుంటారు. నీకు తెలీనిదేముంది" అని హోప్ వజ్రాన్ని త్రాసులోవేసి తూస్తున్నట్లుగా చేతులతో తూచి. "నిజానికి ఈ వజ్రం అంత ఖరీదు చెయ్యదు. ఏదో నామీద అభిమానం కొద్దీ అంత దూరం నుంచీ తెచ్చావు కనుక యాభై ఇస్తాను. ఇచ్చెయ్యి" అన్నాడు.

'నీ పీనాసిబుద్ధికి తగిన శాస్తి త్వరలోనే అనుభవిస్తావులే' అని మనసులో అనుకుని పైకిమాత్రం చిన్నగా నిట్టూర్చి "సరే నీ ఇష్టం. అలాగే కానియ్యి. డబ్బుకోసం స్నేహితుడ్ని దూరం చేసుకోవటం నా కిష్టంలేదు" అన్నాడు కాంతరామ్.

దాంతో భరద్వాజ మొహం విప్పారింది.

"అందుకే... అందుకే నువ్వంటే నా కిష్టమోయ్. అన్నట్టు కేష్ ఇమ్మంటావా? చెక్కా?" అడిగాడు.

"చెక్కు తీసుకుని చిక్కులెందుకు పడాలిగానీ కేష్ ఇవ్వు. మళ్ళా నేను వెంటనే వెళ్ళాలి" అన్నాడు కాంతారామ్.

ఐరన్ సేఫ్‌లోంచి నోట్లకట్టలు తీసి అందిస్తూ "వెళుదువుగానిలే... అలా ఇంటికి వెళ్ళి భోజనం చేసిన తర్వాత. మీ చెల్లాయి కూడా నీ గురించి కలవరిస్తోంది" అలవాటు ప్రకారం అబద్ధం ఆడేశాడు భరద్వాజ.

అతను ఇచ్చిన నోట్లకట్టను లెక్కపెట్టకుండానే బ్రీఫ్‌కేసులో పెట్టుకుని "ఇప్పుడు కాదులే. అవతల నాకు అర్జెంటు పనులున్నాయి. ఈసారి వచ్చినప్పుడు భోజనం చేస్తాను" అంటూనే లేచి నిలబడ్డాడు కాంతారామ్.

"సరే నీ యిష్టం. నా మాట ఎప్పుడు విన్నావు కనుక" నిష్ఠూరంగా అన్నాడు భరద్వాజ. నిజానికి కాంతారామ్ త్వరగా తన ముందునుంచి వెళ్ళిపోతే బావుండునని అతని మనసులో ఉంది.

హోప్ వజ్రం గురించి పదేపదే జాగ్రత్తలు చెబుతూ అక్కడ్నుంచి కదిలి వెళ్ళిపోయాడు కాంతారామ్.

అతను వెళ్ళిపోయాక తనలో తాను గుంభనంగా నవ్వుకున్నాడు భరద్వాజ. అతను పక్కా బిజినెస్ మాన్. అతని దృష్టిలో స్నేహం లేదు. స్నేహితుడ్ని మోసం చేసయినాసరే బిజినెస్‌లో లాభం గడించాలన్నదే అతని పాలసీ.

పొద్దున్నే లేచి ఎవరి మొహం చూశాడోగాని ఇవాళ యాభై వేలు లాభం తనకి. హోప్‌వజ్రం రేటు రెండు లక్షలు అని చెబితే ఎవరైనా కళ్ళు మూసుకుని కొనేస్తారు. అప్పుడు తనకి లక్షా యాభై వేలు లాభం. అన్నట్టు ఇండస్ట్రియలిస్ట్ కానోజీకి అపురూప వస్తువుల్ని సేకరించటం హాబీ కదూ. రేపే అతనికి ఫోన్‌చేసి, ఈ వజ్రం సంగతి చెప్పాలి. అతను కనుక తీసుకుంటే మరో పాతిక వేలు గుంజుకోవచ్చు.

భరద్వాజ ఆలోచనలు ఇలా సాగు తున్నాయి హోప్ వజ్రం గురించి కల లలో తేలిపోతున్న భరద్వాజకి ముంచుకు వస్తున్న ప్రమాదం గురించి అణు మాత్రం కూడా తెలీదు.

తెలిస్తే అలా కలలలోకి తేలిపోకుండా జాగ్రత్త వహించేవాడు.

* * *

ఆ రోజు రాత్రి షాప్ క్లోజ్ చేసిన తర్వాత హోప్ వజ్రాన్ని తన వెంట ఇంటికి తీసుకెళ్ళాడు భరద్వాజ.

భోజనాలు అయ్యాక అందరినీ తన గదిలోకి రమ్మని పిలిచాడు భరద్వాజ. ఏదో విశేషం ఉంటే తప్ప అలా పిలవ డని అందరికీ తెలుసు కాబట్టి ఆ విశేషం ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో అతని భార్య ఆనందమ్మ, కొడుకు నర హరి, కూతురు అరవింద భరద్వాజ గదిలో చేరారు.

హోప్ వజ్రం గురించి ముందు వివ రించి ఆనక దాన్ని అందరికీ చూపిం చాడు భరద్వాజ.

అందంగా, మిలమిల మెరిసిపోతున్న వజ్రాన్ని చూడగానే అందరూ అలా నోరు తెరుచుకుని ఉండిపోయారు.

అందరిలోకి ముందు ఆనందమ్మే తేరుకుని "ఇంత అపురూప వజ్రాన్ని అమ్మడం దేనికండి. మనింట్లోనే వుంచు కుందాం. ఎంచక్కా నలుగురిలోనూ గొప్పగా చెప్పుకోవచ్చు" అంది.

"అవును నాన్నా! అమ్మ చెప్పిందే నిజం. అలాంటి వజ్రం. మనింట్లో ఒకటి ఉండటం స్టేటస్ సింబల్‌గా భావించుకోవచ్చు" అన్నారు నరహరి, అరవింద ముక్తకంఠంతో.

తనకి ఆ వజ్రం అమ్మి లాభాలు గడించాలని మనసులో ఉన్నా అందరూ ఏకకంఠంతో ఇంట్లో వుంచుదామని అనడంతో ఒప్పుకోక తప్పలేదు భర ద్వాజకి.

వాళ్ళ ప్రతిపాదనకు ఒప్పుకుంటూ, "ఇదిగో ఇప్పుడే చెబుతున్నాను. 'మా ఇంట్లో అపురూప వజ్రం ఉందోచ్' అని వళ్ళు తెలియని ఆనందంతో వూరంతా తిరిగి ప్రచారం చేయకండి. ఈ విషయం గిట్టనివాళ్ళు ఎవరన్నా ప్రభు త్వానికి చేరవేస్తే కొంపలు మునుగు తాయి" అని హెచ్చరించాడు భరద్వాజ.

అతను చెప్పినదానికి అందరూ సరేనంటూ తలలూపారు. తర్వాత తన ప్రైవేట్ రూమ్‌లోని సీక్రెట్ అరలో హోప్ వజ్రాన్ని దాచాడు భరద్వాజ.

తన జీవితంలో ఎటువంటి ఆందోళన, ఆలోచనలు లేకుండా భరద్వాజ ప్రశాం తంగా నిద్రపోయిన కొన్ని రాత్రులలో ఆ రోజు రాత్రి ఒకటి.

తెలతెలవారుతుండగా, భరద్వాజ ఇంటిమీద ఇన్‌కమ్‌టాక్స్ రైడ్ జరిగింది.

నరహరి నిద్రలేపి, విషయం చెప్పే వరికి విశ్రాంతి చెందాడు భరద్వాజ.

ఎప్పుడు రైడ్ జరిగినా, ముందుగా ఆ విషయం గురించి అతనికి ఇన్‌ఫర్మేషన్ అందేది. దాంతో అధికారులకు ఏమాత్రం దొరకకుండా జాగ్రత్తపడేవాడు.

కానీ ఈసారి...?

వూహించని విధంగా ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు జరిపిన దాడితో భరద్వాజ చాలా విధాలుగా నష్టపోవలసి వచ్చింది.

దొరికిన డబ్బు, డాక్యుమెంట్లు, జ్యూయలరీని అధికారులు లెక్కలు గడుతూ వుంటే శవచ్ఛవంలా అలా సోఫాకి అంటుకునే ఉన్నాడు భరద్వాజ.

ఆ తతంగమంతా ముగిసేసరికి ఉదయం ఏడు గంటలయింది. అయిదేళ్ళ నుంచీ అపురూపంగా కూడగట్టుకుంటూ వస్తున్న బ్లాక్‌మనీకి రెక్కలు వచ్చి ఎగిరిపోతూవుంటే ఆ షాక్‌కి భరద్వాజ తట్టుకోలేకపోయాడు.

దానికితోడు ఈ విషయం తెలిసిన కొంతమంది సన్నిహితులు ఫోన్లమీద ఓదార్పులు, సానుభూతులు తెలపడంతో తల తీసేసినంత పనయింది భరద్వాజకి. దాంతో బయటికి వెళ్ళడం కూడా మానేశాడు.

నాయిగురోజులు గడిచాయి. భరద్వాజ కోలుకొని మెల్లగా మనుషులలోకి వెళ్ళడం ప్రారంభించాడు.

ఆ రోజు షాప్‌కు వెళ్ళి వ్యాపార వ్యవహారాలు భరద్వాజ చూస్తున్న సమయంలో ఇంటి దగ్గరనుంచి ఫోన్ వచ్చింది.

మేడమెట్లు దిగుతున్న ఆనందమ్మ కాలుజారి మెట్లమీదినుంచి దొర్లి చెయ్యి విరగ్గొట్టుకుందనీ, వెంటనే ఇంటకి రమ్మని కబురు.

ఆ వార్త వినగానే హతాశుడయ్యాడు. ఇన్‌కమ్‌టాక్స్‌రైడ్ జరిగి వారంరోజు లయినా కాలేదు. మళ్ళీ ఇదొకటా? ఇదంతా చూస్తుంటే తమని ఏదో అరిష్టం పట్టి పీడిస్తుందేమోనన్న అనుమానం మొదటిసారిగా కలిగింది భరద్వాజకి.


షాపు అప్పగించి ఇంటికి బయలు దేరబోతుంటే ఇంకో ఫోన్ వచ్చింది భరద్వాజకి. ఈసారి ఇండియన్ ఎయిర్ లైన్స్ కార్యాలయం నుంచి.

ఆ రోజు ఉదయం బొంబాయినుంచి బయలుదేరిన ఎయిర్ బస్ యాక్సిడెంట్‌కి గురయి మొత్తం 20 మంది మరణించారట. అందులో భరద్వాజ కొడుకు నరహరి ఒకడు.

ఇలా ఆర్థికంగా, మానసికంగా దెబ్బ మీద దెబ్బ పడేసరికి భరద్వాజకి తట్టుకోవడం కష్టమయింది. అప్పుడే అతనికి జీవితంలో తొలిసారిగా హార్ట్‌ఎటాక్ వచ్చి గుండె పట్టుకుని ఎలా ఉన్నవాడు అలాగే నేలకూలాడు.

అది చూసి అందరూ కంగారుపడి పోతూ భరద్వాజని ఇంటికి చేర్చారు.

కారులోంచి దింపుతున్న తండ్రిని చూడగానే విపరీతంగా ఆందోళన చెందింది అరవింద. సమయానికి ఇంట్లో




ఉన్న డాక్టర్, భరద్వాజని పరీక్షచేసి, కంగారు పడనవసరంలేదని ఆమెకు అభయం ఇచ్చాడు.

ఒకపక్క మంచంమీద తల్లిని మరో పక్క మంచంమీద తండ్రిని చూస్తూ కుమిలిపోతోంది అరవింద.

చీకట్లు ముసురుకుంటుండగా భర ద్వాజకి మెలుకువ వచ్చింది.

ఒక్క క్షణంపాటు తనెక్కడున్నాడో తెలుసుకోవడానికి చుట్టూ కలియచూశాడు.

పక్క మంచంమీదున్న భార్యను చూడగానే అతని కళ్ళు కన్నీళ్ళతో చిప్పిల్లాయి.

ఇప్పటిదాకా గట్టిగా చీది ఎరుగని భార్యను ఆ స్థితిలో చూసేసరికి అతని మనసు ఆర్ద్రమయింది.

తర్వాత అతని దృష్టి అరవిందమీద పడింది. ఏడ్చిఏడ్చి ఆమె కన్నీరు చారికలు కట్టాయి జుట్టంతా చెదిరిపోయింది.

'పిచ్చితల్లి ఎంత బాధపడుతోందో' అని జాలిపడి "అమ్మా! అరవిందా అల్లుడేడమ్మా?" అని అడిగాడు.

"అన్నయ్య శవాన్ని తీసుకురావ డానికి వెళ్ళారు నాన్నా!" దుఃఖంతో పూడుకుపోతున్న గొంతుతో చెప్పింది అరవింద.

అది వినగానే భారంగా నిట్టూర్చాడు భరద్వాజ.

ఆ సమయంలో తెలిసినవాళ్ళు ఎవ రయినా చూసి అతనే భరద్వాజ అంటే నమ్మరు. ఒక్కరోజులో పది సంవత్స రాల వృద్ధాప్యం అతన్ని ఆవహించి నట్లుగా ఉన్నాడతను.

అతని మనసులో ఒకటే ఆలోచన.

ఇన్ని అనర్థాలు ఒకేసారి జరగడానికి కారణం ఏమిటి? అన్నది ఎంత ఆలో చిస్తున్నా అంతుబట్టడంలేదు.

హఠాత్తుగా అతనికి హాష్ వజ్రం

వచ్చిన రోజునుంచే ఈ అనర్థాలు మొదలయ్యాయన్న విషయం స్ఫురణకు వచ్చింది.

'యస్! ఆ వజ్రం వచ్చిన తెల్లారే ఇన్‌కమ్‌టాక్స్ రైడ్ జరిగింది. తర్వాత ఆనందికి చెయ్యి విరగటం, నరహరి యాక్సిడెంట్‌లో మరణించడం జరిగింది. ఓ మైగాడ్! అపురూప వజ్రం అని కొన్నానే గానీ అదే పక్కలో బల్లెం అవుతుందనుకోలేదు. ప్రాచీన వజ్రాలకు శాపాలుంటా యంటారు. ఆ శాపమే తనని పీడించటంలేదు కదా! ఏమయినా ముందు ఆ హోప్ వజ్రాన్ని వదిలించుకోవాలి' అనుకుంటూ మంచంమీదనుంచి లేవబోయి, ఏదో గుర్తుకువచ్చి ఆగిపోయాడు భరద్వాజ.

'అవునూ... ఈ వజ్రం విషయం కాంతారామ్‌కి తెలిసే ఉంటుంది కదా? మరి తనకి అమ్మాడూ అంటే... అన్నీ తెలిసే కావాలని ఈ వజ్రం తనకి అమ్మాడా? పైకి ఎంతో ప్రేమ వలకబోస్తూ వజ్రం అమ్మి, తెలివిగా తనను చావుదెబ్బ కొట్టాడన్నమాట అమ్మ కాంతారామ్! గతంలో నేను చేసిన మోసానికి ఇలా ప్రతీకారం తీర్చుకున్నావా?' మనసులో అనుకున్నాడు భరద్వాజ.

సరిగ్గా అప్పుడే ఆ గదిలో వున్న ఫోన్ జీవంపోసుకుని మోగసాగింది.

అరవింద లేచి రిసీవర్ ఎత్తింది.

"అవునండి...ఆ! వున్నారు... సరే లైన్లో వుండండి" అని చెప్పి ఫోన్ భరద్వాజ దగ్గరకి తీసుకువచ్చి "నాన్నా! మీ ఫ్రెండ్ కాంతారామ్‌గారట" అని రిసీవర్ అందించింది అరవింద.

వణికే చేతులతో "హలో! కాంతారామ్" అన్నాడు.

"అవును. కాంతారామ్‌నే. హార్ట్ ఎటాక్ వచ్చిందటగా? ఇప్పుడెలా ఉంది? అవునూ! పాపం మీ యింటిమీద ఇన్‌కమ్‌టాక్స్ రైడ్ జరిగిందటగా. ఏమాత్రం పోయాయేం?" వ్యంగ్యంగా అడిగాడు కాంతారామ్ అవతలినుంచి.

ఇక ఆవేశం ఆణుచుకోలేకపోయాడు భరద్వాజ.

"యూ బ్లడీ చీట్! అపురూప వజ్రమని చెప్పి అరిష్టదాయక వజ్రాన్ని అంటగట్టి పైగా పరామర్శలు చేస్తున్నావా... నిన్ను..." కోపంతో వూగిపోయాడు.

"ప్రస్తుతానికి నన్నేం చెయ్యలేవులే. అన్నీ కోల్పోయి బికారిలా తయారయి ఇకముందు ఎవర్నీ ఏమీ చెయ్యలేని స్థితిలోకి వచ్చావు. ఇప్పటికయినా బుద్ధి కలిగి వుండు" అన్నాడు కాంతారామ్.

భరద్వాజకి బిపి పెరిగిపోయి "యూ స్కౌండ్రల్, రోగ్, గాడిదా, కుక్కా, పందివెధవా" అంటూ తిట్టడం ప్రారంభించాడు.

"ఏం నే నంటున్న మాటలు అంత కోపాన్ని తెప్పిస్తున్నాయా? మాటలే ఆలా అనిపిస్తే ఆ రోజున నువ్వు చేసిన

మోసానికి నే నింకెంత బాధపడాలి? నా మీద ఒక కుటుంబం ఆధారపడి వుందని తెలిసికూడా నిర్దాక్షిణ్యంగా నన్ను వీధి పాలుచేశావే. నీ దయవల్ల ఆకలితో అలమటించి, చివరకు తిండిలేక కన్ను మూశాడు నా ఒక్కగా నొక్క కొడుకు. ఆ రోజున నీకంటే ఎక్కువ గర్భ శోకం అనుభవించాను. ఏ రోజయితే నావల్ల పీసమంతయినా ప్రయోజనం లేదని గ్రహించి, నా భార్య లేచిపోయి నన్ను మానసికంగా దెబ్బతీసిందో, ఆ రోజునుంచే నీ మీద ప్రతీకారజ్వాల చెలరేగింది. నా కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసిన నిన్ను సర్వనాశనం చెయ్యాలని నిర్ణయించుకున్నాను. అప్పట్నుంచి పట్టుదలతో డబ్బు సంపాదించడం ప్రారంభించాను ఒకసారి అనుకోకుండా అమెరికా వెళ్ళినప్పుడు హోప్ వజ్రం గురించి విన్నాను. ప్రాణాలకు తెగించి ఆ వజ్రాన్ని సేకరించి ఇక్కడకు తీసుకువచ్చాను. ఎందుకో తెలుసా? పగ... పగ! నాలోని అణువణువు ప్రతీకార జ్వాలతో తపించిపోతోంది. నా చేతులకు రక్తపు మరకలు అంటకుండా ఆ వజ్రాన్ని నీకు అమ్మి, నా పగ చల్లార్చుకున్నాను" అని చెప్పాడు కసిగా.

"అంటే...అంటే... ఇదంతా కావాలనే చేశావా నువ్వు?" అదురుతున్న గుండెల్ని చిక్కబట్టుకోవడానికి ప్రయత్నిస్తూ అడిగాడు భరద్వాజ.

"యస్! ఆ రోజున నువ్వు ఎంత నమ్మకంగా నన్ను మోసంచేసావో, ఇప్పుడు నిన్నూ అలాగే మోసంచేశాను. మోసానికి మోసమే సమాధానం. హోప్ వజ్రం సంగతి నీకు పూర్తిగా తెలియదు. ఆ వజ్రం ఎవరి దగ్గరుంటే వాళ్ళు దిక్కుమాలిన చావు చస్తారు. నీ గతీ అంతే" వికృతంగా నవ్వసాగాడు శాంతారామ్ అవతలినుంచి.

ఆ నవ్వు సూటిగా వచ్చి గుండెల్ని తాకడంతో అక్కడ గాయం రేగినట్టయింది భరద్వాజకి. అతని చేతిలోవున్న రిసీవర్ పట్టుదప్పి కిందకు జారిపడింది.

ఆ రోజే భరద్వాజ జీవితంలో ఆఖరిసారిగా గుండెపోటు వచ్చింది.